# అందం

"నాన్నా, నీకోసం ఎవరో అంకుల్ వచ్చారు." నన్ను చూడగానే గుమ్మంలో నిలబడివున్న ఆరేళ్ల పాప కేకపెట్టింది.

"రావోయ్ రా..." లోపలి నుండి వచ్చిన రవీంద్ర సాదరంగా ఆహ్వానించాడు. మేం కూర్చోగానే "కాఫీ తీసుకురామ్మా" అంటూ ఆ పాపకు పురమాయించాడు.

రవీంద్రనాకు బి.ఏ.లో క్లాసుమేటు. ఆ తర్వాత ఇద్దరం పోస్టు గ్రాడ్యుయేషన్ వేర్వేరు చోట్ల చేశాం. ఉద్యోగాలు వేర్వేరుచోట్ల అవటంతో ఇన్నాళ్ళూ మేం కలుసుకోలేదు. మొన్నీమధ్యనే ఇక్కడికి రవీంద్ర ట్రాన్సఫరయి వచ్చాడు. ఆదివారం నాడు ఫామిలీతో మా యింటికి రమ్మనమని ఆహ్వానించటానికి వచ్చాను.

ఆ గదిలో ఒక వారగావున్న పెద్దపుస్తకాల రాక్ నన్ను ఆకర్షించింది. దాని దగ్గరికెళ్ళి నీట్‌గా సర్దివున్న పుస్తకాల్ని చూస్తూ "చాలానే కలెక్ట్‌చేశావ్" అన్నాను.

"ఎవరి దగ్గర నుండీ కలెక్ట్ చేసినవి కావు. కొనుక్కున్నవే" నవ్వుతూ అన్నాడు.

"కావలసినవి అప్పుడప్పుడూ తీసుకెళ్ళొచ్చుగా?"

"అహ... కాకపోతే తప్పకుండా తిరిగి ఇస్తాననీ, వీటి రూపురేఖలు మారిపోవనీ హామీ పత్రం మాత్రం ఇవ్వాలంతే!"

నేనూ నవ్వి "ఆ మాత్రం జాగ్రత్త వుంది కాబట్టి ఇవి ఇలా మిగిలాయి" అన్నాను.

చాలా మందికి తీసుకెళ్ళిన పుస్తకాలను జాగ్రత్తగా తిరిగి ఇవ్వాలని తెలియదు. జాగ్రత్త మాట అటుంచి కొందరయితే 'పుస్తకాలు కూడా తిరిగి ఇవ్వాలా' అని నిర్లక్ష్యం చేసేస్తారు. నా దృష్టిలో అయితే పుస్తకాలు తిరిగి ఇవ్వకపోవటం కూడా దొంగతనమే.

ఆ పుస్తకాల్లో ఠాగూర్‌ది 'గోరా' కనుపిస్తే తీశాను. ఎప్పుడో చదివాను. కానీ మళ్ళా ఒకసారి చదవాలని ఎప్పటినుండో అనుకుంటున్నాను. ఆ పుస్తకంలో మొదటి పేజీలో ముత్యాల్లాంటి అక్షరాలు కనుపించాయి. లఘువును, గురువుగా చేసి అభిమానించిన గురువుగార్కి,

నమస్కృతులతో, మీ శిష్యురాలు సుందరి అని రాసివుంది.

"ఏమిటోయ్ ఈ గురులఘువుల గొడవ?" ఆ పేజీని చూపిస్తూ రవీంద్రనడిగాను.

అతని పెదవులపై ఒక చిరుదరహాసం వెలిగింది.

"అది నా స్టూడెంట్ ఒకమ్మాయి కానుకగా ఇచ్చింది. లఘువు అంటే తను వయసులో చిన్నకదాఅని అలా రాసింది."

రవీంద్ర చెప్పింది నాకేం అర్థం కాలేదు.

"వివరంగా చెప్పవయ్యా! అలా చెబితే ఎలా తెలుస్తుంది?"

"వింటానంటే చెప్పటానికి నాకేం అభ్యంతరంలేదు. జ్ఞాపకాలను నెమరువేసుకోవటం ఎవరికైనా ఇష్టమేగా!" అన్నాడు రవీంద్ర. ఇంతలో పాప కాఫీలు తెస్తే తీసుకున్నాం. రవీంద్ర చెప్పాడు.

"నేను లెక్చరర్‌గా మొదట ఒంగోలులో చేశానని తెలుసుగా. అధ్యాపక వృత్తిలోకి వచ్చిన మొదటి సంవత్సరం అది. ఆ రోజు ఫస్టియర్ డిగ్రీవాళ్ళ క్లాసు తీసుకుంటున్నాను. లెసన్ చెప్పటం పూర్తవగానే ఒక ప్రశ్నవేశాను.

ఎవరూ సమాధానం చెప్పలేదు. నిశ్శబ్దంగా కూర్చున్నారు. 'ఎవరూ లేరా?' అన్నట్లుగా అమ్మాయిలవైపు చూశాను. ఒకమ్మాయి నిలబడి ఆన్సరు చెప్పింది. ఆ అమ్మాయిని నేను క్లాసులో అదే చూడటం. అప్పటికి కాలేజీలు తెరిచి పదిహేనురోజులపైనే అయినా ఆ అమ్మాయి ఆరోజునుండే క్లాసులకు రావటం జరిగింది. అనారోగ్య కారణం వలనని ఆ తర్వాత నాకు తెలిసిందనుకో. క్లాసులో ఆ రోజే చూడటం వలన వివరాలు తెలుసుకోవాలని యథాలాపంగా "వాటీజ్ యువర్ నేమ్" అనడిగాను.

ఆ అమ్మాయి మెల్లగా "సుందరి" అని చెప్పి కూర్చొంది. వెంటనే క్లాసులోని అబ్బాయిలు ఒకరిద్దరు "అహ – ఓహో" అన్నారు. ఇంకెవరో కొంటె కుర్రాడు "ఆహా... సుందరీ, నీ వంటి దివ్య స్వరూపం ఎందెందు వెదికిన లేదు గదా" అంటూ రాగం తీసేసరికి  క్లాసంతా సన్నసన్నగా నవ్వులు చెలరేగాయ్! కారణం ఆ అమ్మాయి రూపం పేరుకి పూర్తి విరుద్ధంగా వుంది మరి!

నేను 'సైలెన్స్' అంటూ ఏదో అనబోయేంతలోనే ఆశ్చర్యంగా ఆ అమ్మాయి చటుక్కున లేచి నిలబడి అబ్బాయిలవైపు నిర్భయంగా చూస్తూ చెప్పింది.

"చూడండి, మీలో ఎంతమంది సార్థక నామధేయులున్నారోగానీ నాకు తెలియదు. పుట్టినప్పుడు అందంగా కనుపించానో లేక పెద్దవాళ్ళపేరనో ఏదో కారణంతో తల్లిదండ్రులు నాకీ పేరుపెట్టి వుండొచ్చు.

ఎవరి రూపురేఖలకైనా వాళ్ల బాధ్యతేమీ వుండదని మీ అందరికీ తెలుసు. కానీ, మన స్వభావానికీ, గుణగణాలకీ మనదే బాధ్యత. దానిని బట్టే ఎవరినైనా ప్రశంసించినా, పరిహసించినా సమంజసంగా వుంటుందని నా అభిప్రాయం"

ఆ మాటలు చెప్పేసి తన స్థానంలో కూర్చుంది. 'సారీ, సిస్టర్' అని అబ్బాయిలవైపు నుండి మెల్లగా గొణగటం వినిపించింది. ఇంతలో బెల్ అయింది. అంతా బయటకు వెళ్ళిపోయారు. ఆ అమ్మాయి అందరికంటే వెనగ్గా మెల్లగా వస్తోంది. నేను గుమ్మం దగ్గర నిలబడి ఆ అమ్మాయితో మెల్లగా "స్టూడెంట్స్ కుర్రతనం కొద్దీ ఏదో అంటారు. ఫీలవకూడదు" అంటూ ఏదో చెప్పబోతోంటే మధ్యలో అడ్డుకుని అంది "నాకు తెలుసుసార్. వాళ్ళు ఏదో నవ్వుకోవాలనే సరదాకొద్దీ అన్నారేకానీ నన్ను హర్ట్ చేయాలని కాకపోవచ్చు. నేను బాధపడింది దానికి కాదుసార్."

"మరి?" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాను.

"ఉపాధ్యాయుడు విద్యార్థుల ప్రతిభకేగానీ రూపురేఖలకి ప్రాముఖ్యత నివ్వకూడదు కదాసార్. కానీ స్టూడెంట్సుతోపాటూ మీ పెదవులపై విరిసిన చిరునవ్వే నన్ను బాధపెట్టింది. కాకపోతే మీకు చెప్పలేక వాళ్లతో చెప్పాను. ఎక్కువ మాట్లాడితే క్షమించండి."

మెల్లగాచెప్పి, నేను ఆశ్చర్యంలోనుండి ఇంకా తేరుకోకముందే చకచకా వెళ్ళిపోయింది. నిజమే, క్లాసులో ఎవరూ చెప్పలేకపోయిన ప్రశ్నకి ఆ అమ్మాయి సమాధానం చెప్పినప్పుడు మెచ్చుకోలేదుగానీ, నాలోనుండి ఇంకా పూర్తిగా పోని విద్యార్థి ప్రవృత్తితో నా పెదవులపై అప్రయత్నంగా చిన్ననవ్వు జారింది. అదే ఆ అమ్మాయి మనసును బాధ పెట్టింది! కావాలని చేయకపోయినా అప్రయత్నంగా నావల్ల జరిగిన పొరపాటది. ఆరోజు ఇంటికెళ్ళాక చాలాసేపు ఫీలయ్యాను. ఆ అమ్మాయి అందరూ నవ్వితే బాధపడుతూ ముడుచుకుపోయి కూర్చోకుండా తన మనసులోని మాటను నిర్భయంగా చెప్పగలిగిన ఆ సాహసం నన్ను ముగ్ధుడిని చేసింది.

ఆ తర్వాత నెలరోజులకనుకుంటా క్లాసులో నోట్సు వ్రాసుకుంటూంటే ఆ అమ్మాయి చేతిలోని పెన్నుజారి క్రిందపడింది. పాళీ వంగిపోయినందువల్ల రాయటంలేదు. నేను గమనించి నా పెన్ను ఇచ్చాను. ఆ మరునాడు నేను స్టాఫ్ రూములో వుండగా ఆ అమ్మాయి నా పెన్ను తీసుకొొచ్చి ఇచ్చింది.

నేను తీసుకోకుండా "అది నా గురుదక్షిణగా నీ దగ్గరే వుండనివ్వు" అన్నాను.

"అదేమిటిసార్?" అంది ఆశ్చర్యంగా.

"నిజానికి నా విద్యార్థివే అయినా ఆరోజు నాకొక పాఠం నేర్పించి గురువ్వికూడా అయ్యావుగా!" అన్నాను చిరునవ్వుతో.

"క్షమించండి సార్. ఆరోజు ఏదో ఆవేశంలో..."

"నోనో... నేను దానికేం ఫీలవలేదు. నా పొరపాటును గుర్తించేట్లుగా చేసిన నీ సాహసానికి నేనెంతో ముగ్ధుణ్నయ్యాను! అప్పటి నుండీ నీకు చెప్పాలని నేను అనుకుంటున్నాను. ఈ పెన్నును నా ప్రెజెంటేషన్‌గా నీ దగ్గరే వుండనివ్వు" అన్నాను.

"థేంక్స్" చెప్పి పెన్ను తీసుకుని వెళ్ళిపోయింది. అప్పుడు ఆ అమ్మాయి ముఖంలో కనిపించిన ఆనందానికి నాకూ సంతోషంగా అనిపించింది. ఆ తర్వాత రెండేళ్లకు నాకు ట్రాన్స్‌ఫరుయి వెళ్ళిపోతోంటే ఈ పుస్తకాన్ని ఆ అమ్మాయి నాకు ఇచ్చింది.

ఒక అందాల అభిమాన శిష్యురాలు ఇచ్చిన కానుకగా ఇది నాకెంతో విలువైనది!

ఆ పుస్తకంలోని పేజీలను చూస్తూ చిరునవ్వుతో చెప్పటం ముగించాడు రవీంద్ర.

"అందాల శిష్యురాలా, అదెలా?" అని సంశయంతో అడగబోయి ఆగిపోయాను.

సాహసం, చురుకు, తెలివితేటలు కలిగిన ఆ అమ్మాయి క్రొత్తవాళ్ళకేమోగానీ, పరిచయస్తులకు తన విశిష్ట వ్యక్తిత్వంతో అందంగా కనుపించటంలో ఆశ్చర్యమేముంది!

ఎక్కడో చదివిన ఓ వాక్యం నాకు గుర్తుకొచ్చింది. "అందం స్వభావలోపాన్ని పూరించలేదు. కానీ, మంచి స్వభావం అందం లేని లోపాన్ని పూరిస్తుంది!"

ఈనాడు ఆదివారం 6, ఆగష్టు, 1989.